క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

పీసీపల్లి: మండలంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండలంలో నేరేడుపల్లిలో 1, మార్లెల్లో 1 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పదోతరగతి పూర్తి చేసి, 18 ఏళ్లు దాటిన వారు ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ అనంతరం 27న నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

పసిపాపకు అండగా దాతలు

ఉలవపాడు: అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలిక మాకా శ్రావ్య వైద్య ఖర్చుల కోసం దాతలు స్పందిస్తున్నారు. మాకా శ్రావ్యకు నరాల సంబంధిత వ్యాధి రావడంతో వైద్యశాలలో చికిత్స పొందుతోంది. దాతల సహాయం కోసం సాక్షిలో పసిపాపకు పెద్దకష్టం పేరుతో కథనం రావడంతో దాతలు స్పందిస్తున్నారు. ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాల సిబ్బంది రూ.13,200 పంపించారు. వివిధ ప్రాంతాలలో వైద్యశాలలో పనిచేస్తున్న ఫార్మసిస్టులు అధికంగా ఫోన్‌పేల ద్వారా నగదు పంపించారు. మంగళవారం మొత్తం రూ.82 వేలు ఫోన్‌పేల ద్వారా వచ్చినట్లు తండ్రి సురేష్ తెలిపారు. స్పందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియచేశారు. ప్రస్తుతం పాపకు వెంటిలేటర్ తీశారని, శ్వాస తీసుకుంటుందన్నారు.

ఆలయాలకు దీపారాధన సామగ్రి పంపిణి


సామగ్రి అందచేస్తున్న నారాయణరావు

గుడ్లూరు: మండలంలోని దళిత, గిరిజన కాలనీల్లోని గ్రామ దేవతల ఆలయాలకు సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్య దీపారాధన సామగ్రిని ఫౌండేషన్ అధ్యక్షుడు బొద్దుకూరి నారాయణరావు పంపిణీ చేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 100 గ్రామదేవతల ఆలయాలకు పూజా సామగ్రిని అందచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మాలకొండయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

‘చెకుముకి’ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

సింగరాయకొండ: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి చెకుముకి టాలెంట్ టెస్ట్ దోహదపడుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.హరిబాబు పేర్కొన్నారు. స్థానిక దాచూరి రామిరెడ్డి, అనసూయమ్మ, ప్రజాసంఘాల భవనంలో మంగళవారం చెకుముకి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోటీ పరీక్షకు 8, 9, 10వ తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. కార్యక్రమంలో జేవీవీ ఉపాధ్యక్షుడు కోటపాటి నారాయణ, సునీల్‌కుమార్‌రెడ్డి, ఎం.నరశింహారావు, టంగుటూరి రాము, జి.శ్రీనివాసులు, టి.రామ్మూర్తి పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో మేలు


పొన్నలూరులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో అన్నదాతలకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు పలు వ్యవసాయ పద్ధతులు, రుణ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉపయోగపడతాయన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం, బ్యాంకుల ద్వారా మహిళా రైతులకు ప్రభుత్వం ఆర్థిక వెసులుబాటు కల్పిస్తోందన్నారు. రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబించాలని డీఆర్‌సీ ఏఓ వెంకట శేషమ్మ వివరించారు. కార్యక్రమంలో ఏఓ టి.పూర్ణచంద్రరావు, సింగరాయకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు నిర్మలకుమారి, ఎంపీఈఓ సబీహా, సీసీ వెంకటేశ్వర్లు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

జరుగుమల్లి: మండలంలోని ఎడ్లూరపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై వి.వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.36,400 నగదు, ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జూదరులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి


చోడవరంలో ఓపి నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మాధవీలత


జరుగుమల్లిలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నిర్మల


పెదరాజుపాలెంలో మెడికల్ కిట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు


దాసరిపల్లి వైద్య శిబిరంలో మందులు తీసుకుంటున్న రోగులు


జువ్విగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్లు పంపిణీ

హనుమంతునిపాడు: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసకొచ్చారని ఎంపీడీఓ కె.లలిత, తహసీల్దార్ ఎస్ హరిబాబు, సర్పంచ్ భవనం క్రిష్టారెడ్డి అన్నారు. మంగళ్లవారం దాసరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల్లో గ్రామ సర్పంచ్ భవనం క్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించిన శిబిరాల్లో 4950 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. ఎంపీడీఓ లలిత, తహసీల్దార్ ఎస్.హరిబాబు, ఏఓ క్రిష్టారావు, కార్యదర్శి శ్రీనివాసులు, షరీఫ్, డాక్టర్ సందీప్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పామూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కంబాలదిన్నెలో మంగళవారం సర్పంచ్ నీలం వెంకట రమణమ్మ అధ్యక్షతన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్లు విజయ్‌కుమార్, రుబీనా, నరేంద్ర, రవికుమార్‌లు 376 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. అనంతరం పౌష్టికాహారస్టాల్‌ను పరిశీలించి పౌష్టికాహారం పంపిణీచేశారు. గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గోవిందయ్య, జి.వెంకటేశ్వరరెడ్డి, హెచ్‌ఈఓ పెరుగు శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, నీలం రత్తయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు, శ్రీరాం శ్రీను, కోటా వెంకట క్రిష్టారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

కనిగిరి: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టిందని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 4వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించా మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, కౌన్సిలర్ శ్రీరామ్ సతీష్, షఫీ అజాద్, తిరుపతయ్య, డాక్టర నాయబ్‌రసూల్, కంటు గురవయ్య, రహిమాన్, నాగూర్ వలి, భారతి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి భరోసా నిస్తోందని మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్‌రావు, తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా, ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం మండలంలోని పెదరాజుపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో సర్పంచ్ పందిళ్ల నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మురళి, రాజేష్ 383 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా ప్రత్యేకాధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ, సర్పంచ్ రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, పందిళ్ల ఎల్లయ్య, దనెంకుల నాగార్జున, ఈఓపీఆర్డీ కె.సుందరరామయ్య, సీహెచ్‌ఓ వెంగయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం జెడ్పీటీసీ

కనిగిరి రూరల్: ప్రజా ఆరోగ్యమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. ఆయన కనిగిరి మండలం పునుగోడు పంచాయతీ సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. వైద్య శిబిరంలో రోగులకు మెడికల్ కిట్లు, మందులు అందజేశారు. ఎంపీపీ తిరుపతరెడ్డి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ స జన, సర్పంచ్ తిరుపతమ్మ, వైఎస్ సర్పంచ్ వెంకటరెడ్డి, గొల్లపలి సర్పంచ్ నారాయణరెడ్డి, గురువాజీపేట సర్పంచ్ అంకిరెడ్డి, యూత్ లీడర్ సంగటి మహేంద్రరెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జున్ డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు , అంగన్‌వాడీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని చోడవరం విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 465 మందిని పరీక్షించినట్లు పెట్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అనూష తెలిపారు. ఈ శిబిరాన్ని ఒంగోలు డీవైఎంహెచ్‌ఓ మాధవీలత పరిశీలించారు. తహసీల్దార్ సింగారావు, సర్పంచ్ స్వర్ణ నవీన్, ఎంపీహెచ్‌ఈఓ రవిబాబు, డాక్టర్లు పాల్గొన్నారు.

జరుగుమల్లి: మండలంలోని చతుకుపాడు సచివాలయ పరిధిలో వైద్య శిబిరాన్ని ఎంపీపీ ఎంపీపీ బెల్లం నిర్మల ప్రారంభించారు. వైద్య సేవలను డీవైఎంహెచ్‌ఓ మాధవీలత పర్యవేక్షించారు. మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారయణ, ఎంపీడీఓ కె.జలజాక్షి, డీటీ అరుణ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరు: మండలంలోని ముండ్లమూరివారిపాలెంలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ దగ్గుపాటి లక్ష్మీకుమారి ప్రారంభించారు. ప్రజలకు మందులు పంపిణీ చేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సుంకిరెడ్డిపాలెం సర్పంచ్ లెక్కల కృష్ణారెడ్డి, ఎంపీడీఓ కల్పన, పీహెచ్‌సీ డాక్టర్లు కీర్తి, కల్పన, కృష్ణచైతన్య, మాజీ సర్పంచ్ ముళ్లమూరి వెంకటేశ్వర్లు, యంప్రాల మాధవ, దగ్గుపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు–2 గ్రామ సచివాలయం పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. 507 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి ఎం.చైతన్యకృష్ణ తెలిపారు. ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, డీటీ తన్నీరు వెంకటేశ్వరరావు, డాక్టర్లు వంశీధర్, ధీరేందర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడి: మండలంలోని జువ్విగుంట గ్రామంలో 570 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ ఎస్.సుదీపా, తహసీల్దార్ హరిబాబు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటిరెడ్డి సర్పంచ్ రావులపల్లి సుమలత, వైద్యాధికారులు కీర్తిశ్రీ, సంగీత పాల్గొన్నారు.

టంగుటూరు: టంగుటూరు 3వ సచివాలయం పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 400 మందిని వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. 15 మందిని సర్జరీలకు రిఫర్ చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ మల్లీశ్వరి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను వరికూటి సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నజ్యోతి, డీటీ శ్రీనాథ్, వైద్యులు ప్రసాద్‌బాబు, రెహనా, సీహెచ్‌ఓ మాతయ్య, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, సోమేపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.


కంభాలదిన్నెలో పౌష్టికాహారస్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు


కనిగిరిలో రోగులకు మందులు కిట్లు అందజేస్తున్న చైర్మన్, కమిషనర్


ముండ్లమూరివారిపాలెంలో మందులు అందజేస్తున్న అధికారులు


మూలగుంటపాడు వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు


టంగుటూరులో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రత్నజ్యోతి

దుర్గాదేవి నమోస్తుతే..


సీఎస్‌పురంలో విశిష్ట అలంకరణలో కామాక్షి అమ్మవారు


పెదయిర్లపాడులో గాయత్రిదేవిగా అమ్మవారు


కందుకూరులో అన్నపూర్ణాదేవి అలంకరణలో సరస్వతి అమ్మవారు

సీఎస్‌పురం (పామూరు): దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన మండలంలోని భైరవకోనలో మంగళవారం త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సీఎస్‌పురంలోని కామాక్షీసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భైరవకోనలో మహాగణపతి హోమం, సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఈఓ నర్రా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేయడంతోపాటు వసతి సదుపాయాలు కల్పించారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడులోని మల్లేశ్వర స్వామిదేవస్థానంలో దేవిశరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 3వ రోజు సందర్భంగా మంగళవారం అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పామూరు: దసరా శరన్నవరాత్రులలో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు వేదమంత్రాల నడుమ వాసవీమాత మూలవిగ్రహమూర్తికి, ఉత్సవమూర్తికి విశేష పూజలు చేశారు. గణపతిహోమం నిర్వహించారు. కమిటీ చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరవన్నరాత్రులు

కందుకూరు: దేవీశరవన్నరాత్రుల ఉత్సవాలు పట్టణంలో వైభవంగా సాగుతున్నాయి. పట్టణంలోని అమ్మవారి ఆలయాల భక్తులతో కళకళాడుతున్నాయి. పెద్ద బజార్‌లోని సరస్వతి దేవాలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో జరిగిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నపూర్ణాదేవీ అలంకారంలో సరస్వతీదేవి దర్శనమిస్తే, గాయత్రీదేవీ అలంకారంలో వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణాదేవిగా చెట్టుమహాలక్ష్మమ్మ

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు మంగళవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

27న నూతన ముసాయిదా ఓటరు జాబితా

- కొండపి ఎలక్టోరల్ అధికారి నారదముని వెల్లడి


కొండపిలో ఓటరు సర్వేపై సమీక్షిస్తున్న ఈఆర్‌ఓ నారదముని

కొండపి(సింగరాయకొండ): కొండపి నియోజకవర్గ నూతన ముసాయిదా ఓటరు జాబితాను ఈనెల 27వ తేదీ ప్రకటించనున్నట్లు ఈఆర్‌ఓ నారదముని వెల్లడించారు. కొండపి రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఓటరు సర్వే కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎలక్టోరల్ అధికారి నారదముని మాట్లాడుతూ.. నూతన ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,386 ఓట్లు తగ్గాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 2011 ఓటరు జాబితా ప్రకారం 2,36,205 ఓట్లు ఉండగా ప్రస్తుతం 2,33,819 ఓట్లు ఉన్నాయని వివరించారు. ఓటరు సర్వేను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. నూతన ముసాయిదా ఓటరు జాబితా అందరు బీఎల్‌ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. ఓటరు జాబితాలో సవరణల కోసం ఈనెల 27 నుంచి డిసెంబర్ 26వ తేదీ గడువు ఇచ్చినట్లు తెలిపారు. ఎక్కడైనా 5 కంటే ఎక్కువ ఓట్లు తొలగించాలని ఫారం–7 దరఖాస్తు చేసిన వారిని గుర్తించాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నియోజకవర్గంలో ఇంజినీరింగ్, వెల్ఫేర్, వ్యవసాయ అసిస్టెంట్లను 23 మందిని మార్చి ఇతరులకు ఆ విధులు అప్పగించామని, ప్రత్యామ్నాయం లేనిచోట మాత్రం వారినే కొనసాగించామని వివరించారు. తహసీల్దార్ సీహెచ్ ఉష, సింగారావు, సీపీఐ, టీడీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో చెట్లను తొలగించాలి


దారి ఆక్రమణ ప్రాంతాన్నిపరిశీలిస్తున్న ఆర్డీఓ

సీఎస్‌పురం (పామూరు): ఆక్రమిత రోడ్డు ప్రాంతంలో సాగుచేసిన చెట్లను తక్షణం తొలగించాలని కనిగిరి ఆర్డీవో తోట అజయ్‌కుమార్ అన్నారు. మండంలోని రామాపురం నుంచి గాంధీనగర్‌కు వెళ్లే దారి సర్వేనంబర్ 133/2, 140/2 ను ఆక్రమించి దారితో పాటు సుమారు 75 ఎకరాల్లో ఎర్రచందనం చెట్లను సాగుచేశారు. దీనిపై ఈనెల 13వ తేదీన పామూరులో జరిగిన జగనన్నకు చెబుదాం స్పందనలో జేసీ కే.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంగళవారం కనిగిరి ఆర్డీఓ తోట అజయ్‌కుమార్, తహసీల్దార్‌తో కలిసి క్షేత్రస్థాయిలో ఆక్రమిత రోడ్డును, అందులో సాగుచేసిన 490 చెట్లను పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ బుధవారం సాయంత్రంలోగా ఆక్రమిత రోడ్డుస్థలంలో చెట్లను తొలగించేలా చూడాలని, లేకుంటే తామే తొలగించి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నల్లమడుగులలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గురుబ్రహ్మం, వీఆర్‌వో శ్రీను, గ్రామస్తులు గాధంశెట్టి లక్ష్మీనరసయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుగు పందెం

ఉలవపాడు: స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం పరుగుపందెం పోటీలు నిర్వహించారు. దసరా సెలవుల్లో భాగంగా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన శిబిరంలో పోటీలు నిర్వహించారు. పిల్లలు ఉత్సాహంగా పరుగు పందెంలో పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులతో చేత నీతికథలు చదివించారు. బాలల కథధలు, ఇంగ్లీషు స్టోరీ పుస్తకాలు చదివించారు. మొత్తం 52 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు.

మిరపలో పూసా హైడ్రోజల్ విధానం ఉపయోగకరం

- ఒంగోలు డీఆర్సీ వ్యవసాయాధికారి శైలజారాణి


అనకర్లపూడిలో పూస హైడ్రోజల్ విధానంలో సాగు చేస్తున్న మిరప

కొండపి(సింగరాయకొండ): మిరప సాగులో బెట్ట పరిస్థితులను ఎదుర్కొని నాణ్యమైన దిగుబడి సాధించాలంటే పూసా హైడ్రోజల్ విధానం ఎంతో ఉపయోగకరమని ఒంగోలు డీఆర్సీ వ్యవసాయాధికారి శైలజారాణి పేర్కొన్నారు. కొండపి మండలం అనకర్లపూడి ఆర్బీకే పరిధిలో మంగళవారం రైతు వేముల రాములు పొలంలో 2023–24 ఆత్మ ఫార్మర్ ఓరియెంటెడ్ పథకం కింద ప్రయోగాత్మకంగా పూసా హైడ్రోజల్ విధానంలో మిరప సాగు చేపట్టారు. మొదట పొలాన్ని దున్నుకుని తరువాత పశువుల ఎరువుతో కలిపి పూసా హైడ్రోజల్ మిశ్రమాన్ని పొలంలో చల్లుకోవాలన్నారు. తద్వారా వర్షం పడ్డప్పుడు నీటిని పీల్చుకుని తరువాత మొక్కకు అవసరాన్ని బట్టి అందిస్తుందన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా మిరపలో మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. ఒక ఎకరాకు కేజీ పూసా హైడ్రోజల్‌ను ఉచితంగా అందజేశారు. ఒంగోలు డీఆర్సీ వ్యవసాయాధికారి వెంకట శేషమ్మ, వీఏఏ భరత్, రైతులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువతో మహిళలకు చేయూత


రుణహామీ పత్రాలు అందజేస్తున్న జేసీ, ఇతర అధికారులు

కందుకూరు: జగనన్న పాలవెల్లువ ద్వారా మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ అన్నారు. మండలంలోని ఓగూరులో మంగళవారం జరిగిన జగనన్న పాలవెల్లువ గ్రామసభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఓగూరు గ్రామానికి పాలవెల్లువ కింద ఎంపిక చేశామని, ఈ గ్రామంలో 120 కుటుంబాలు పశుపోషణ, పాల ఉత్పత్తిపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. వీరందరితో పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు, కలెక్షన్ కేంద్రాల ద్వారా అమూల్ డైరీ ద్వారా పాల సేకరణ చేస్తామన్నారు. ఇతర ప్రైవేట్ డైరీలతో పోల్చుకుంటే అమూల్ ద్వారా పాలకు అధిక ధర వస్తుందని చెప్పారు. అలాగే పాల ఉత్పత్తిని పెంచేందుకు రైతులకు బ్యాంకు లోన్‌లు ఇచ్చి గేదెలు కొనిపించే కార్యక్రమం కూడా చేస్తున్నామన్నారు. దీని గాను ఇప్పటికే గ్రామంలో కొంత మంది రుణాలు మంజూరయ్యాయని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పాల వెల్లువ ద్వారా మహిళలకు అదనపు ఆదాయం చేకూరుతుందని, మహిళలు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్‌కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పశుసంవర్ధకశాఖ జేడీ కోటేశ్వరరావు, డీడీ చంద్రశేఖర్‌రావు, కో ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ మృదుల, మండల పశువైద్యాధికారి చెన్నకేశవులు, ఎంపీడీఓ విజయశేఖర్, తహసీల్దార్ బ్రహ్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తొట్టెంపూడి శ్రీను, యనమద్రి సుబ్బారావు, మాచర్ల పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాకారుల శిక్షణ శిబిరం

కనిగిరి: ఈ నెల 20 నుంచి 22 వరకు చిత్తూరు జిల్లాలో జరిగే 42వ రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనే జట్టుకు శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. గత 20 రోజులుగా జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో కంచర్లవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ గఫార్, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డిలు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు, కనిగిరికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడాకారులకు జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వంగపాడు ఎంపీటీసీ హజరత్ అమ్మగారు కెనడా దుస్తులను అందజేశారు. క్రీడాకారులకు షూను మాజీ జాతీయ ఖోఖో క్రీడాకారుడు కేఎస్ మహమ్మద్, వారి తండ్రి ఎస్‌కే దస్తగిరి అందజేశారు. ప్రకాశం జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


క్రీడా దుస్తులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, జెడ్పీటీసీ